
పెదగొట్టిపాడు పీహెచ్‌సీకి పగుళ్లు



పగిలిన కిటికీ గ్లాసులకు అతికించిన పేపర్లు



ఆసుపత్రిలో పగుళ్లు తీసిన గోడ



గోడకు వచ్చిన పగుళ్లు

- పదేళ్లకే కాలం చెల్లుతున్న వైనం
- ఊడిపడుతున్న గోడల పెచ్చులు
- దాదాపుగా పగుళ్లు తీసిన అన్ని గదుల్లోని గోడలు

ప్రత్తిపాడు: పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కాలం చెల్లుతోంది. ఆసుపత్రి భవనం నిర్మించి పట్టుమని పదేళ్లు కూడా నిండకుండానే భవనం పగుళ్లిస్తోంది. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులను నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ.లక్షల ప్రజా ధనం వెచ్చించి నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించారు. అయితే భవన నిర్మాణం మొదలయ్యింది మొదలు నేటికీ ఆసుపత్రిని కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.

పెచ్చులూడుతున్న గోడలు..

ఆపరేషన్ థియేటర్, పేషెంట్స్ రూం, స్టోర్ రూం, డాక్టర్ల ఓపీ గదులు.. ఇలా దాదాపుగా అన్ని గదుల్లోనూ గోడలు నెర్రలిచ్చాయి. కాగా కొన్ని గదుల్లో అయితే పగుళ్లు ఎక్కువయ్యి గోడలకున్న సిమెంటు పెచ్చులూడి కిందకు పడుతుంది. ఇక కిటికీలు, తలుపులకు కూడా నెర్రలిస్తున్నాయి. కిటికీలకున్న గ్లాసులు పగిలిపోవడం, డోర్లు సరిగా పడకపోవడంతో తాత్కాలికంగా రక్షణ కోసం పేపర్లు అడ్డుగా అతికించుకుని సిబ్బంది విధులను నిర్వర్తించుకుంటున్నారు.



పెదగొట్టిపాడు పీహెచ్‌సీ

ఎటు చూసినా పగుళ్లే..

అప్పట్లో దాతలిచ్చిన స్థలంలో పీహెచ్‌సీని నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ విద్యుత సౌకర్యం లేక కొన్ని నెలలు, వాటర్ సౌకర్యం లేక మరి కొన్ని నెలలు, నాయకులకు ప్రారంభించే తీరిక లేక ఇంకొన్ని నెలలు ఇలా సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఏదోలా బాలారిష్టాలన్నీ అధిగమించి భవనాన్ని ప్రారంభించారు. భవనం పైకి సుందరగా పైకి పటారంగా కనిపిస్తున్నప్పటికీ లోపల చూస్తే అంతా లొటారమే. ఏ గది చూసిన గోడలన్నీ పగుళ్లు తీసి కనిపిస్తున్నాయి.



బెంబేలెత్తిస్తున్న శునకాలు!

పొన్నూరు పట్టణ పరిధిలో పదుల సంఖ్యలో శునకాలు గుంపులుగా చేరి వీధుల్లో సంచరిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణ పరిధిలోని డఫ్ పేట, డీవీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ముబారక్ నగర్, ఇందిరా నగర్ కాలనీ ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లో వీటి బెడద ఎక్కువగా ఉంది. రాత్రివేళల్లో ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, సైకిళ్లపై వెళ్లేవారిని శునకాలు గుంపులుగా వెంబడించి గాయపరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణ పరిధిలో నెలకొన్న శునకాల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– పొన్నూరు


సీపీఐ బలోపేతానికి కృషి



లక్ష్మీపురం: సీపీఐ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ కోరారు. గుంటూరు చాకలి గుంట 17వ డివిజన్ సీపీఐ సీనియర్ నాయకులు మొహిద్దీన్ పీరా అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ల పేరుతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిందని మండిపడ్డారు. ఆగస్టు నెల 4, 5 తేదీలలో జిల్లా మహాసభలు గుంటూరులో జరగనున్నాయని అలాగే రాష్ట్ర మహాసభలు ఆగస్టు 23, 24, 25, తేదీలలో ఒంగోలు నగరంలో జరగబోతున్నాయని, దేశంలోని అన్ని రాష్ట్రాల మహాసభలు పూర్తి అయిన తర్వాత సెప్టెంబర్‌లో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరగబోతున్నాయని ఆయన వెల్లడించారు. అనంతరం డివిజన్ నూతన శాఖ కార్యదర్శిగా చినిపోతుల విజయకుమార్‌తో పాటు 7 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల ఆనందరావును సన్మానించారు. ఈ మహాసభలో నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, ప్రజానాట్య మండలి నగర అధ్యక్షులు మిట్టపల్లి మహేంద్ర పాల్గొన్నారు.

జైహింద్ గురూజీ సేవలు అభినందనీయం

డాక్టర్ రాయపాటి శ్రీనివాస్



గుంటూరు వెస్ట్: యోగాతోపాటు మాస్టర్స్ అథ్లెట్స్‌లో రాణిస్తున్న జైహింద్ గురూజీ దంపతుల సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ కొనియాడారు. గత నెల 30 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు గోవాలో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 12వ నేషనల్ గేమ్స్‌లో డాక్టర్ జైహింద్ గురూజీకి యోగా, 100, 800, 1500 మీటర్ల పరుగులో వరసగా నాలుగు బంగారు పతకాలు, ఆయన సతీమణి సుబ్బాయమ్మకు స్విమ్మింగ్, జావెలిన్ త్రో, జావెలిన్ త్రోలో మూడు బంగారు పతకాలు మొత్తం 7 బంగారు పతకాలు వచ్చాయన్నారు. వారిని ఆదివారం స్థానిక ఎల్వీఆర్ క్లబ్‌లో రాయపాటి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్ సిద్ధార్థ్, పార్థసారథి, కొమ్మినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను అవగాహనతోనే జయించాలి

ప్రముఖ ఆంకాలజిస్ట్ మహతి



మాట్లాడుతున్న ప్రముఖ ఆంకాలజిస్ట్ మహతి

లక్ష్మీపురం: ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలలో ప్రధానమైనది క్యాన్సర్ సమస్య అని ప్రముఖ ఆంకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ టి.మహతి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధి గుర్తించినప్పుడు అధైర్య పడక వెంటనే తగు వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకున్నవారు సాధారణమైన జీవితాన్ని ఆనందంగా గడపవచ్చుఅన్నారు. ఇటీవల ఈ క్యాన్సర్ వ్యాధికి సంబంధించి అనేక అధునాతన వైద్య పద్ధతులు వచ్చాయని వివరించారు. క్యాన్సర్‌కు వ్యాక్సిన్ అవకాశం ఉందని, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా ఈ క్యాన్సర్ రాకుండా నియంత్రణ చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మహతిని ఘనంగా సత్కరించారు. ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, ఆరోగ్యవిషయాల విశ్లేషకుడు వి.వి.రావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్ శ్రీనివాసరావు , కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ పి.ఆర్.ఓ వై.వి.రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

పాఠశాలలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సామాజిక వేత్తలు

నూతక్కి(మంగళగిరి): పాఠశాలలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి విజ్ఞాన విహార విద్యాలయంలో ఆదివారం రాష్ట్ర స్థాయి వర్షారంబ సమావేశాలను విద్యా భారతీ ప్రాంత అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు ప్రారంభించారు. సమావేశాలలో రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక యోజన, పాఠశాల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పడానికి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్య మాత్రమే సమాజంలో మనిషిని ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు. విద్య విలువ తెలుసుకుని రాణిస్తే మనిషి ఉన్నత స్థాయికి చేరడంతో పాటు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో విద్యా భారతి రాష్ట్ర కార్యదర్శి జె.ప్రతాప్ సింహశాస్త్రి, సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, ఉపాధ్యక్షుడు వెలగపూడి రామకృష్ణ, భారతి క్షేత్ర ప్రతిక్షణ ప్రముఖులు రావుల సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాక్టరీ ప్రీమియర్ లీగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ శాంతిరాజ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం హైస్కూల్‌లో గత 15 రోజులుగా జరుగుతున్న ఫ్యాక్టరీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ శాంతిరాజ్ విచ్చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు ఈ తరహా టోర్నమెంట్‌లు యువతకు మంచి అవకాశాలను కల్పిస్తాయని అన్నారు. మొత్తం 50 జట్లు పాల్గొనగా, బీఎస్ఆర్ 11 వర్సెస్ రెడ్ చిల్లీస్ జట్టు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బీఎస్ఆర్11 జట్టు విజేతగా నిలించింది. అనంతరం తెలుగు యువత ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్ సహకారంతో నగదు బహుమతులను అందజేశారు. డీఎస్పీ శాంతిరాజ్, ముమ్మిడి సత్యనారాయణ చేతుల మీదుగా ప్రథమ స్థానంలో నిలిచిన బీఎస్ఆర్ జట్టుకు రూ. లక్ష బహుమతిని, ద్వితీయ స్థానంలో నిలిచిన రెడ్ చిల్లీస్ జట్టుకు రూ. 50 వేల బహుమతిని, తృతీయ స్థానంలో నిలిచిన వల్లభనేని వెంకటరావు జట్టుకు రూ.25 వేలను అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన కొర్రపాటి అశోక్ కుమార్‌కు రూ.10వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ కొర్రపాటి అశోక్‌కుమార్‌కు రూ.5 వేలు, బెస్ట్ బౌలర్‌గా నిలిచిన ప్రశాంత్‌కు రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ



నగరంపాలెం: స్థానిక కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థాన ఆవరణలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు. -స్థానిక లాలాపేట పద్మావతి అండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. భక్తుల దర్శనార్థం శ్రీస్వామి వారికి దశావతారాల అలంకారం చేశారు. ఉదయం 108 కలశలతో అష్టోత్తర సప్తన అభిషేకాలు నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, శ్రీస్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అం దించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు.

పచ్చిరొట్ట పైర్లతో లాభాలెన్నో



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

గుంటూరు రూరల్: నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పైర్లు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం పంటలు పండించే నేలలో కోటానుకోట్ల సూక్ష్మజీవులు నివసిస్తూ పంటలకు అవసరమైన పోషకాలు అందిస్తూ ఉంటాయన్నారు. ఈ సూక్ష్మజీవులన్నీ నేలలో ఉండే సేంద్రియ పదార్థాన్ని ఆసరాగా చేసుకుని జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటాయన్నారు. రైతులు విచక్షణా రహితంగా రసాయనాలు ఉపయోగించడం, పంట వ్యర్థాలను తగలబెట్టడం, సేంద్రియ ఎరువులను సక్రమంగా అందించకపోవడం లాంటి తప్పులతో నేలలో సేంద్రియ పదార్థం తగ్గడంతో పాటు పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య తగ్గుతూ వస్తుందన్నారు. దీని పరిష్కారం నేలలో సేంద్రియ పదార్థం పెరగడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని.. అందులో పచ్చిరొట్ట పైర్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. రైతులకు పచ్చిరొట్ట పంటలకు చెందిన 30 రకాల విత్తనాలతో కూడిన 6 కిలోల కిట్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం రాజకుమారి, సేంద్రియ రైతు ధనుంజయరావు, రైతు నేస్తం ఫౌండేషన్‌చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు షైనింగ్ స్టార్ అవార్డులు



షేక్ రిజ్వానా



యోగితాదేవి



పిల్లి హెన్నప్రసన్న



ఎం సిరిప్రియరెడ్డి



కృష్ణకౌశిక్



ఎల్ అఖిల్

పెదకాకాని: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి శంకరరాజు తెలిపారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేశామని ఆయన అన్నారు. పెదకాకాని మండలం నుంచి షేక్ రిజ్వానా(591), జెడ్పీహెచ్ఎస్ పెదకాకాని.. యోగితాదేవి(546), జెడ్పీహెచ్ఎస్ పెదకాకాని.. పిల్లి హెన్నప్రసన్న(589), గీతాంజలి విద్యాలయం, పెదకాకాని నుంచి ఎంపికయ్యారు. అలానే అగతవరప్పాడు శ్రీచైతన్య నుంచి ఎం.సిరిప్రియరెడ్డి(587), ఎస్‌హెచ్ఎస్ కృష్ణ కౌశిక్(590), ఎల్ అఖిల్(587)లు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కాగా నలుగురు ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఉన్నారు. షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం రూ.20 వేల నగదు, మెడల్, అప్రిషియేషన్ సర్టిఫికెట్లు అందించనున్నారు. విద్యార్థులను ఎంఈఓ శంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా ప్రతిభ చూపిన విద్యార్థులకు కాకుండా కుల రిజర్వేషన్‌ల ప్రాతిపదికన అవార్డులకు ఎంపిక చేయడం.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులను ఇద్దర్ని మాత్రమే ఎంపిక చేసి కార్పొరేట్ స్కూల్‌లో చదివిన నలుగురిని ఎంపిక చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

స్కాంలు తప్ప.. స్కీంలు లేవు...

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్కాంలు తప్ప.. స్కీంలు లేవని వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షులు ఈమని రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏడాది కాలంలో చంద్రబాబు సర్కార్ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం. ఇటీవల జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనటమేనని పేర్కొన్నారు. కనీసం మహిళలకు ఇస్తానన్న ఉచిత బస్సు తుస్సుమనించారని, తల్లికి వందనానికి మంగళం పాడారని, గ్యాస్ సబ్సిడీ లీక్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యపడిందన్నారు. కరోనా వంటి కల్లోల సమయంలో సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడి గడప ముందుకు చేర్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పథకాలు ఇవ్వలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ.. ఇదేమని ప్రశ్నిస్తే.. దాడులకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కచ్చితంగా ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలపై మేధావులు, విద్యావేత్తలు, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ గళమెత్తాలని కోరారు. అప్పుడైన ప్రజలకు మేలు జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న పట్టణ సీఐ వినోద్‌కుమార్

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని పోలీస్‌స్టేషన్ నుంచి ఆదివారం డ్రోన్ కెమెరాతో పట్టణమంతా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలు జరిగేందుకు ఆస్కారమున్న నగరంలోని పలు ప్రాంతాలను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టేందుకు డ్రోన్‌లు వినియోగిస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాలు పోలీసుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందన్నారు. ప్రముఖుల బందోబస్తులో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి



దీక్షా శిబిరంలో కార్మికులు, యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పటికైనా చెల్లించాలని యూనియన్ నాయకుల స్టీవెన్ కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేసిన దగ్గర నుంచి ఇప్పటి వరకు సుమారు 170 మంది మరణించారని ఆయన అన్నారు. అయినప్పటికీ యాజమాన్యంలో స్పందన లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల సమస్యపై దృష్టి సారించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గురవయ్య, దానయ్య, నవనీతం, ఇమాంబీ, దుర్గాభవాని, ఆశీర్వాదం, నాగేశ్వరరావు, హగ్గయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆచార్య ఎన్జీ రంగాకు నివాళులు

పొన్నూరు: రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 30వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం రంగా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రంగా సెంటర్, రంగా స్మృతీవనంలో కమిటీ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్జీ రంగా రైతుల సంక్షేమం కోసం అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రంగా కమిటీ సభ్యులు బొద్దులూరి రంగారావు, వెలగా సుబ్బారావు, ఆకుల జానకిబాబు, గోగినేని అనిల్ కుమార్, గురుబాలు, కంచర్ల రాజేష్‌బాబు, ముట్టినేని మధుబాబు, పెదపూడి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట



(శలపాడు) చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలోని గంగా పార్వతి సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో ఆదివారం జీవ ధ్వజ స్తంభ పునః ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం నేలకూలింది. దీంతో నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు ఏర్పాట్లను పూర్తిచేశారు. వివిధ పూజా కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమారు ఆరు వేల మందికి అన్నదాన చేశారు. శలపాడు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

11న ఉపకులపతి శ్రీనివాసరావుకు సాంబయ్య స్మారక పురస్కారం

నగరంపాలెం: ఈనెల 11న బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై విద్యాప్రదాత సాంబయ్య వర్ధంతి, ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సిహెచ్.సాంబయ్య స్మారక పరిషత్ వ్యవస్థాపకులు సీహెచ్ భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావుకు సీహెచ్ సాంబయ్య స్మారక పురస్కారంతో సత్కరించనున్నట్లు చెప్పారు. సభానంతరం కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు ఉంటాయని అన్నారు.

బెంగళూరు తొక్కిసలాట ఘటన దురదృష్టకరం

లక్ష్మీపురం: బెంగళూరు స్టేడియం ఘటన దురదృష్టకరం అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో హోమం



నగరంపాలెం: స్థానిక కృష్ణానగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగో రోజుకి చేరాయి. ఆదివారం సుప్రభాత సేవతో ప్రారంభమై, బాల భోగ నివేదన, నీరాజనం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ నిత్యహోమాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ-ఆంజనేయహవనం పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం విష్ణుసహస్ర నామపారాయణ జరిగింది. అనంతరం ఉత్సవమూర్తులను కనుల పండువగా అలంకరించి విశేష శోభాయాత్ర నిర్వహించారు. స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

మంగళగిరి టౌన్: కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యూనియన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని అన్నారు. జూలై 9వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను బలపరుస్తూ కూటమి ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు మారుస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం.బాలాజీ, అధ్యక్షులు పరమేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుజ్జిబాబు, ఉపాధ్యక్షులుగా కిరణ్, నాగేశ్వరరావు, జ్యోతి, కోశాధికారిగా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా రవికుమార్, మనోజ్‌బాబులు ఎన్నికయ్యారు.